

నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, మంగళవారం 28 జనవరి 2025 | KAMAREDDY

# మోసపోయి గోస పడుతున్నం..

## బీఆర్ఎస్ హయాంలో ఇబ్బందులు లేకుండే..

- రైతుబంధు, ఎరువులు సకాలంలో అందేవి..
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులకన్నీ కష్టాలే
- వ్యవసాయం కష్టమైంది..బతుకు భారమైంది..
- బలవన్మరణాలకు పాల్పడిన రైతు కుటుంబాలకు మేమున్నామని భరోసా ఇచ్చిన బీఆర్ఎస్





నమస్తే తెలంగాణ యంత్రాంగం, జనవరి 27: బీఆర్ఎస్ హయాంలో పదేండ్లు ఆనందంగా ఉన్న రైతులను ఏడాదికాలంగా కష్టాలు వెంటాడుతున్నాయి. రైతాంగానికి అబద్ధపు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వ్యవ'సాయం'పై నిర్లక్ష్యం వహించింది. రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో రేవంత్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. కర్షకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నది. పంట పెట్టుబడి సాయం అందించడంలో సర్కార్ తాత్సారం చేయడంతో ఏం చేయాలో తెలియక రైతన్న దిగాలు చెందుతున్నాడు. ఒకవైపు అప్పుల బాధలు, బ్యాంకు అధికారుల వేధింపులు మరోవైపు ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడం, సమయానికి పంట పెట్టుబడి సాయం అందించకపోవడంతో రైతన్న చితికిపోతున్నాడు. వ్యవసాయం భారమై, ఆత్మాభిమానాన్ని చంపుకోలేక, సర్కారు సాయం అందక బలవన్మరణమే శరణ్యమని ప్రాణాలు వదులుతున్నాడు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 15 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. గుండె చెదిరి ప్రాణాలను వదిలిన రైతుకుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచింది. నాలుగురోజుల క్రితం నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం బుస్సాపూర్‌లో రైతు ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభంపై మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన రైతు అధ్యయన కమిటీ పర్యటించింది. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కమిటీ సభ్యులు తెలుసుకున్నారు. రైతాంగం సమస్యలను పరిష్కరించేవరకూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తేలేదని అధ్యయన కమిటీ స్పష్టం చేసి, అండగా ఉంటామని కర్షకుల్లో భరోసా నింపింది.

### హామీలను నమ్మి మోసపోయినం

రైతు అధ్యయన కమిటీ సభ్యులకు రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఏడాదికాలంగా పడుతున్న ఇబ్బందులను తెలియజేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి ఓటు వేశామని, ఇప్పుడు మోసపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. రైతు భరోసా రూ.15వేలు అని చెప్పి, ఇప్పుడేమో రూ.12వేలు అంటూ మాట తప్పారన్నారు. అదికూడా టైంకు ఇవ్వకపోవడంతో అప్పులు చేసి సాగుచేస్తున్నామని వాపోయారు. జిల్లాలో రుణమాఫీ కూడా అందరికీ చేయలేదని, సగం మందికిలోపే చేశారని అన్నారు. ధాన్యాన్ని విక్రయించడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. కేసీఆర్ పాలనలో ఆనందంగా ఉన్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పట్టించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సంక్షేమ పథకాల ఫలాలు సమయానికి అందకపోవడంతోనే అన్నదాతలు ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు అభిప్రాయాలు వ్యక్తంచేశారు

### రుణాలివ్వమంటే తిప్పుతుండ్రు



కాంగ్రెస్ పార్టీ చెప్పిన మాటలు నమ్మి మోసపోయినం. నాకు రూ. 20వేల రుణ మాఫీ అయ్యింది. కానీ ఇందులో రూ. 1304 కడితేనే నాకు పాసు పుస్తకాలు ఇస్తామన్నారు. ఇదేనా రుణమాఫీ. నమ్మిన మమ్మల్ని నట్టేట ముంచారు. రుణం కావాలని పోతే బ్యాంకులు ఇయ్యకుండా తిప్పుతున్నాయి

-కుంట దశాగౌడ్, రైతు, బాబానగర్

### కౌలు రైతులను మోసం చేసింది..



కౌలు రైతులకు కూడా కాంగ్రెస్ పార్టీ రైతు భరోసా ఇస్తామని చెప్పింది. ఇవ్వకుండా కౌలు రైతులను మోసం చేసింది. రైతు భరోసా ఎకరానికి రూ.15వేలు అని చెప్పి చేతులు ఎత్తేసిండు. రేవంత్ రెడ్డి చెప్పిన మాటలు నమ్మి ఓట్లు వేసి గెలిపించుకుంటే రైతులను నట్టేట ముంచిండు. కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నది ఒకటి, చేస్తున్నది మరొకటి. దేనికీ పొంతనలేకుండా పోయింది.

-గాంధీ, రైతు, పురాణీపేట్, భీమ్‌గల్ మండలం

### కాంగ్రెస్ పార్టీని నమ్మరు..

"రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేలు ఎగొట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలకు, చేస్తున్న పనులకు సంబంధం లేదు. రైతులకు ముచ్చట్లు చెప్పి మోసం చేసింది రేవంత్ రెడ్డి సర్కారు. రోజులు చెబుతూ కాలం గడుపుతున్నారు. రైతులు కాంగ్రెస్ పార్టీని నమ్మరు."

-తోగిటి అరుణ్, రైతు, భీమ్‌గల్



### రైతులందరికీ ఇవ్వాలి



బాల్కొండ, జనవరి 27 : రైతుభరోసా ఇస్తమని చెప్పి ఇస్తలేరు. ఇప్పటికైనా రైతులందరికీ ఇవ్వాలి. అప్పుడే రూ.10వేలు అంటరు, మళ్లీ రూ.12వేలు అంటరు. రూ.15 వేలు ఇస్తమని హామీ ఇచ్చి ఇస్తలేరు. ఇప్పటికైనా రైతుభరోసా అందరికీ ఇవ్వాలి.

-రాజేందర్, దూద్‌గాం, బాల్కొండ

### రైతులు మోసం చేసిన ఏ ప్రభుత్వమూ బాగుపడలే



రైతులను మోసం చేసిన ప్రభుత్వం చరిత్రలో ఎప్పుడూ బాగుపడలేదు. కాంగ్రెస్ మాటలు నమ్మి ఆ పార్టీకి రైతులు ఓటేసినందుకు ఇప్పుడు బాధపడుతున్నారు. మళ్లీ పదేండ్ల క్రితంనాటి గోస అనుభవిస్తున్నాం. రైతు బంధు వస్తలేదు. పండిన పంట కొంటలేరు. పెట్టుబడి కోసం వ్యాపారుల దగ్గరికిపోతే వడ్డీ అడుగుతున్నారు. లేదంటే కేసీఆర్ ఉన్నప్పుడు మేమే ధర నిర్ణయించేటోళ్లం. ఇప్పుడు వ్యాపారులే ధర నిర్ణయించే పరిస్థితి వచ్చింది.

- మహిపాల్, నాగపూర్, బాల్కొండ

### నమ్మిమోసపోయా..



భీమ్‌గల్, జనవరి 27 : నేను బ్యాంకులో రూ. 84వేల లోన్ తీసుకున్న. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తున్నదని భరోసాతో ఉన్న. కానీ డబ్బులు మాఫీ కాలేదు. నా ఇంటికి బ్యాంకు వారు వచ్చి నన్ను లోన్ డబ్బులు కట్టమని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. జూన్ 12వ తేదీన లోన్ డబ్బులు కట్టిన. రుణమాఫీ జూన్ 18 నాడు అయ్యింది. బ్యాం కుకెళ్లి అడిగితే నీ డబ్బులు వచ్చి వాపస్ పోయినయి అన్నారు. ఆఫీసుల చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోయిన. నువ్వు కట్టి న నీ రుణం మాఫీ అయితదని బ్యాంకు వారు మోసం చేసిండ్రు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సకాలంలో డబ్బులు ఖాతాలో వేయక నేను నమ్మి మోస పోయిన.

-కనుక రణధీర్, రైతు, బాచన్‌పల్లి, భీమ్‌గల్ మండలం

### కేసీఆర్ సర్కార్ అన్ని అందుబాటులో ఉంచేది

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పంట మొదలుపెట్టే సమయంలోనే అన్ని సౌకర్యాలను అందుబాటులో ఉంచేది. పంట కోతకు వచ్చే వరకు అధికారులను ఎల్లవేళలా అందుబాటులో ఉంచేవారు. కానీ ఇప్పుడు అధికారులు సమయానికి రావడంలేదు, మాకు సలహాలు ఇవ్వడంలేదు. రైతులను విస్మరించిన ప్రభుత్వం ఎన్నటికీ నిలబడదు.



- దేవత్ రవి, రైతు, బాల్కొండ

### నానా కష్టాలు పడాల్సి వస్తున్నది



కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో రైతులు నానా కష్టాలు పడాల్సి వస్తున్నది. గత ప్రభుత్వం నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంతో మాకు మోటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదు. మోటర్లు కాలిపోవడం కూడా జరగలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో మోటర్లు కాలిపోయి రిపేర్ల కోసమని, మళ్లీ అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తున్నది.

- అశోక్, కిసాన్‌నగర్, బాల్కొండ మండలం

### సర్పంచ్ ఎన్నికల కోసం మళ్లీ ఈ నాటకాలు



కాంగ్రెస్ చేసిన మోసాలపై అన్ని గ్రామాల్లో చర్చ పెట్టాలి. ఒక్క ఏడాదిలోనే కాంగ్రెస్ సర్కారుపై వ్యతిరేకత పెరిగింది. కాంగ్రెస్ మాటలకు మోసపోయినం. ఇప్పుడు సర్పంచ్ ఎన్నికలు వస్తున్నాయ్. మళ్లీ పథకాలంటూ నాటకాలు ఆడుతున్నారు. మళ్లీ మోసపోం. గ్రామాల్లో కాంగ్రెస్ నేతలను నిలదీస్తాం. తగిన బుద్ధి చెప్తాం.

- రాంరాజ్, రైతు, కిసాన్‌నగర్, బాల్కొండ

---

- నిజామాబాద్ కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్‌గా కలెక్టర్ రాజీవ్‌గాంధీహన్మంతు, బోధన్ మున్సిపల్ ప్రత్యేకాధికారిగా అదనపు కలెక్టర్ అంకిత్
- కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డికి అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

## మున్సిపల్‌లో 'ప్రత్యేక' పాలన

కంఠేశ్వర్/బోధన్/బాన్సువాడ/ఎల్లారెడ్డి రూరల్, జనవరి 27: మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ఆదివారం ముగియడంతో అర్ధరాత్రి నుంచి ప్రత్యేకాధికారుల పాలన షురూ అయ్యింది. ఉమ్మడి జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. నిజామాబాద్ నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును నియమించగా, సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ దిలీప్‌కుమార్, ఇతర అధికారులు ప్రత్యేకాధికారి, కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. బోధన్ మున్సిపల్ అధికారిగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అంకిత్ బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్‌లోని తన కార్యాలయంలో సంబంధిత ఫైళ్లపై స్పెషలాఫీసర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు సంతకాలు చేశారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపల్ ప్రత్యేకాధికారిగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)శ్రీనివాస్‌రెడ్డిని నియమించారు.



---

- గంజాయి రవాణాపై గట్టి నిఘా ఉంచాలి
- జిల్లా కేంద్రంలో డీ -అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలి
- డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి కృషిచేయాలి
- అధికారులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశం

## మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, జనవరి 27 : గంజాయి, క్లోరోఫామ్, అల్ప్రాజోలం వంటి మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి సంబంధిత శాఖల అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశించారు.

మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతూ నిరంతరం నిఘాను కొనసాగించాలని సూచించారు. సమీకృత జల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బోధన్, అర్బన్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరయ్యారు. సమావేశంలో జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, రవాణా తదితర అంశాలపై చర్చించారు. వాటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై పోలీసు, ఎక్సైజ్, ఔషధ నియంత్రణ మండలి అధికారులకు కలెక్టర్, ఎమ్మెల్యేలు సూచనలు చేశారు. నిజామాబాద్‌ను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

### గంజాయి రవాణాపై గట్టి నిఘా ఉంచాలి

జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ ఆంధ్ర, ఒడిస్సా సరిహద్దు ప్రాంతాల నుంచి నిజామాబాద్ మీదుగా గంజాయిని ఆడపాదడపా మహారాష్ట్రకు స్మగ్లింగ్ చేస్తున్నారని, గట్టి నిఘా ఉంచాలన్నారు. ముఖ్యంగా రోడ్డు, రైలు మార్గాల ద్వారా వీటిని రవాణా చేసే అవకాశాలున్నందున ఆర్టీసీ, రైల్వే అధికారులతో కలిసి నిరోధక చర్యలు చేపట్టాలని సూచించారు. తనిఖీ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఉంచాలన్నారు. గంజాయి విక్రేతలను, దానిని వినియోగించే వారిని గుర్తించి కఠిన శిక్ష పడేలా కోర్టులకు సమగ్ర ఆధారాలు సమర్పించాలన్నారు. కల్తీ కల్లు తయారీ కోసం వినియోగించే అల్ప్రాజోలం నిల్వలను గుర్తించాలన్నారు.

### అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై ప్రజలకు వివరిస్తూ విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు వీటికి అలవాటు పడకుండా ఉండేందుకు వీలుగా కళాశాలల్లో క్రమం తప్పకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారి కోసం జిల్లా కేంద్రంలో డీ–అడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

ఈ మేరకు కలెక్టర్ తన చాంబర్‌లో డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటుపై సంబంధిత అధికారులతో పాటు, ప్రముఖ మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ విశాల్‌తో ప్రత్యేకంగా చర్చించారు. ఈ కేంద్రం ఏర్పాటు దిశగా తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు . సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి.సోమిరెడ్డి, ఏసీపీ రాజావెంకటరెడ్డి, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సహాయ సూపరింటెండెంట్ డీసీబీ నాయక్, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ, జిల్లా సంక్షేమాధికారిణి రసూల్ బీ, పోలీస్, ఎక్సైజ్, రవాణా, ఔషధ నియంత్రణ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## షూటింగ్ స్పాట్‌గా 'నాగన్న బావి'

లింగంపేట, జనవరి27: మండల కేంద్రంలోని పురాతన నాగన్న బావి షూటింగ్‌లకు స్పాట్‌గా మారింది. శతాబ్దాల కాలం నాటి నాగన్న బావి శిథిలావస్థకు చేరింది. నిర్లక్ష్యానికి గురై శిథిల దశకు చేరిన నాగన్న బావి స్థితి గతులపై గతంలో 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనంపై అప్పటి జిల్లా కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ స్పందించారు. నాగన్న బావి అభివృద్ధిపై దృష్టి సారించారు. కలెక్టర్ ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు ఇన్ఫోసిస్ సంస్థ, రెయిన్ వాటర్ ప్రాజెక్టు వారి సహకారంతో అభివృద్ధి చేశారు. అప్పటి ఎమ్మెల్యే జాజాల సురేందర్, ప్రస్తుత ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ప్రత్యేక నిధులు కేటాయించి పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారు. సోమవారం నాగన్న బావి వద్ద కామారెడ్డి, నిజామాబాద్ జిల్లా కేంద్రాలతో పాటు పిట్లం, గాంధారి, డిచ్‌పల్లి తదితర గ్రామాలకు చెందిన కొందరు ప్రీ వెడ్డింగ్ షూట్ నిర్వహించారు. షూటింగ్ నేపథ్యంలో నాగన్న బావి పరిసరాలు సందడిగా మారాయి.



నాగన్న బావిలో షూటింగ్ సందడి

## షట్టర్ లిఫ్టింగ్ దొంగల ముఠా నాయకుడి అరెస్టు

- పరారీలో ముగ్గురు ముఠా సభ్యులు
- 11 కేసులను ఛేదించిన పోలీసులు
- ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి వెల్లడి



ముఠా వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాజా వెంకటరెడ్డి

వినాయక్‌నగర్, జనవరి 27: నిజామాబాద్ జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల్లో వరసగా చోరీలకు పాల్పడిన షట్టర్ లిఫ్టింగ్ దొంగల ముఠా నాయకుడిని పోలీసులు అరెస్టు చేశారు. నిజామాబాద్ ఏసీపీ ఎల్.రాజా వెంకట్‌రెడ్డి సోమవారం తన కార్యాలంలో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఠాకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రలోని పర్బని జిల్లా కోత్వాల్ పోలీస్ ఠాణా పరిధిలో నివాసం ఉండే కరణ్ సింగ్ వృత్తిరీత్యా లారీ డ్రైవర్. కరణ్‌సింగ్ కొంత కాలంగా లాథూర్‌కు చెందిన కరణ్ సింగ్ బాపూరీ, అజయ్ సింగ్, జాల్నా కు చెందిన మనోహర్ సింగ్‌తో కలిసి ముఠాగా ఏర్పాడ్డారు. వీరు గతేడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు కేవలం నిజామాబాద్ నగరంలోని 11 చోట్ల షట్టర్ లిఫ్టింగ్ దొంగతనాలకు పాల్పడ్డారు. పదిరోజుల క్రితం నగరంలోని జవహర్ రోడ్డు, పూసలగల్లీలో వరుస చోరీలు జరగడంతో బాధితుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. దర్యాప్తులో షట్టర్ లిఫ్టింగ్ దొంగల నాయకుడైన కరణ్ సింగ్‌ను అరెస్టు చేసి, అతడి నుంచి కట్టర్‌తోపాటు ఒక రాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముఠాలో ఉన్న మరో ముగ్గురు పరారీలో ఉన్నారని,వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో ఏసీపీ, ఎస్‌హెచ్‌వోతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.